# ఎస్సీలను ఏబిసిడిలుగా వర్గీకరించాలి..

పరకాల: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం కామరెడ్డి పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూఎస్సీ వర్గీకరణను ఏబీసీడీలుగా వర్గీకరించాలన్నారు. వర్గీకరణ ద్వారానే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని, లేకపోతే 57ఉప కులాలకు చెందిన వారు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో అవకాశాలు కోల్పోతారని చెప్పారు.అణగారిన వర్గాలకు కూడా వర్గీకరణ ఫలాలు దక్కాలన్న ఉద్దేశంతో మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా ఉద్యమం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏబీసీడీలుగా వర్గీకరించి ఆమోదింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పల్లె గ్రామ శాఖ అధ్యక్షుడు హనుమకొండ విజయ్, కొయ్యడ అఖిల్, తిక్క రాజు, నాగెల్లి రఘు, కొయ్యడ జశ్వంత్, కొయ్యడ కొమరయ్య, కొయ్యడ రాజేష్, శ్రీపతి శివాజీ, తిక్క యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :14 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 08-03-2025 | పేజీలు:4 వెల: 2.00

# ఎల్‌కేజీ విద్యార్థి పీహెచ్‌డీ హోల్డర్‌కి ఉపన్యాసం ఇచ్చినట్టుంది



చెన్నై: తమిళనాడులో హిందీ భాష విషయమై రాజకీయం పీక్ స్టేజ్‌కు చేరుకుంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్రమంత్రుల మధ్య విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. స్టాలిన్ వ్యాఖ్యలకు తాజాగా కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కౌంటరిచ్చారు. తమిళ భాషకు కేంద్రం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. తమిళం విషయంలో స్టాలిన్ రాజకీయం సరికాదన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తమిళనాడులోని రాణిపేటలో పర్యటిస్తున్నారు. శుక్రవారం సీఐఎస్ఎఫ్ కార్యక్రమానికి అమిత్ షా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ. .'ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో ఉన్నత విద్య కోసం తమిళ భాషలోనే సిలబస్ తీసుకొస్తాం. వీలైనంత త్వరగా చర్యలు చేపడతాం. తమిళ భాష అభివృద్ధి, సంస్కృతికి కట్టుబడి ఉన్నాం. దేశంలో ప్రాంతీయ భాషలు అన్నింటినీ గౌరవిస్తాం. ఇప్పటివరకు సీఏపీఎఫ్ నియామకంలో మాతృభాషకు స్థానం లేదు. ఈ నేపథ్యంలో యువతకు నష్టం జరుగుతోందని ప్రధాని మోదీ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు. అన్ని భాషలతో పాటు తమిళంలో కూడా సీఏపీఎఫ్ పరీక్షలు నిర్వహించాలని మోదీ నిర్ణయించారు. ఇప్పటికైనా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సీఎం స్టాలిన్ మానుకోవాలి' అని కామెంట్స్ చేశారు.అంతకుముందు, కేంద్రంపై సీఎం స్టాలిన్ విరుచుకుపడ్డారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై ఆయన విమర్శలు చేశారు. స్టాలిన్ ట్విట్టర్ వేదికగా..'విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పటికీ గెలవని యుద్ధం మొదలు పెట్టారు. చెట్టు ప్రశాంతంగా ఉండాలని అనుకున్నా.. గాలి రాకుండా మాత్రం ఉండదు కదా!. అలాగే.. భాష విషయంలో ఆయన మమ్మల్ని రెచ్చగొడుతున్నారు. అందుకే ఆయనకు వరుసగా లేఖలు రాస్తున్నాం. ఎన్ఈపీని తిరస్కరిస్తున్న తమిళనాడు.. ఇప్పటికే విద్యావిధానంలో అనేక లక్ష్యాలను సాధించింది.త్రిభాష విషయంలో.. ఎల్‌కేజీ విద్యార్థి పీహెచ్‌డీ హోల్డర్‌కి ఉపన్యాసం ఇచ్చినట్లు ఉంది ఆయన తీరు. మేం ఢిల్లీ ఆదేశాలను తీసుకోం. త్రిభాషా విధానంపై బీజేపీ సర్కారు చేస్తున్న సంతకాల ప్రచారం హాస్యాస్పదంగా ఉంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్నే ప్రధాన అజెండాగా చేసుకొని బరిలో దిగాలని సవాల్ విసురుతున్నా. పథకాల దగ్గర నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇచ్చే అవార్డుల వరకు అన్నింటికీ హిందీ పేర్లను పెట్టారు. దేశంలో అధికంగా ఉన్న హిందీయేతర ప్రజలను ఇది ఉక్కిరిబిక్కిరి చేస్తుంది' అని స్టాలిన్ చెప్పుకొచ్చారు.

# కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీలు ఎవరు?.. స్థానాలు 'నాలుగు' రేసులో 16 మంది



హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం(మార్చి 9న) తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పెద్దలతో తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీ కానున్నారు.తెలంగాణలో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎవరు అనే సస్పెన్స్ కాంగ్రెస్ పార్టీ నేతలు నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్.. ఆదివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. అదే రోజున ఏఐసీసీ పెద్దలతో తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీ కానున్నారు. ఇక, తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను అధిష్ఠానం ఖరారు చేయనుంది. కాంగ్రెస్ నేతల భేటీ సందర్భంగానే మంత్రి వర్గ విస్తరణ, పార్టీలో కీలక పదవులు కూడా ఖరారు చేసే అవకాశం ఉంది. అన్ని పదవులు భర్తీ చేసి భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.మరోవైపు.. ఎమ్మెల్సీ బరిలో ఓసీ కేటగిరి నుంచి వేం నరేందర్ రెడ్డి, పారిజాత నరసింహ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, కుమార్ రావు, కుసుమ కుమార్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. బీసీ కేటగిరి నుండి ఇరవత్రి అనిల్, కొనగాల మహేష్, జెర్పేటి జైపాల్, గాలి అనిల్ ఉన్నారు. ఎస్సీ కేటగిరి నుండి అద్దంకి దయాకర్, జ్ఞాన సుందర్, దొమ్మటి సాంబయ్య, రాచమల్ల సిద్దేశ్వర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎస్టీ నుంచి బెల్లయ్య నాయక్ , బానోతు విజయాభాయి, రేఖా నాయక్ పేర్లను హైకమాండ్ పరిశీలిస్తున్నట్టు సమాచారం.ఇదిలా ఉండగా.. తెలంగాణ ఎమ్మెల్సీల నామినేషన్లు దాఖలుకు ఈ నెల 10 చివరి తేదీ కావడంతో కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఇప్పటికే వడపోత ప్రక్రియ ప్రారంభించారు. పలువురి పేర్లను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఈనెల 20న ఎమ్మెల్సీ ఎన్నికల జరుగుతున్న క్రమంలో ఖాళీ అయిన ఐదు స్థానాలలో నాలుగు కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశం ఉంది. ఇక, నాలుగు సీట్లలో ఒకటి సీపీఐకి ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

# టీడీఆర్ బాండ్ల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు



అమరావతి,మార్చి7: గత ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్ల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని మంత్రి నారాయణ అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఈ బాండ్ల కొనుగోలులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్, సీఐడీలతో విచారణ చేయిస్తామన్నారు. వాటి నుంచి నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తణుకు, తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కొనుగోలులో అక్రమాలు జరిగాయి. తణుకులో రూ.63.24 కోట్ల విలువ ఉంటే.. రూ.754 కోట్లకు బాండ్లు ఇచ్చారు. తిరుపతిలో రూ.170.99 కోట్లకు 29 టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. ప్రస్తుతం 965 టీడీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలల్లోపు వీటి అక్రమాలపై పూర్తి స్పష్టత ఇస్తాం' అని నారాయణ తెలిపారు. విశాఖలో టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విజిలెన్స్, సీఐడీ విచారణ జరుగుతోందని.. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో టీడీఆర్ బాండ్లపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్లలో భారీగా అవకతవకలు జరిగాయని.. ఒక్క విశాఖలోనే కాదు తణుకు, తిరుపతిలో కూడా అక్రమాలు చేశారని చెప్పారు. తణుకులో రూ.63.24 కోట్ల విలువ ఉన్న చోట రూ.754 కోట్లకు బాండ్లు జారీ చేశారని తెలిపారు.రూరల్ ఏరియాలో భూమి తీసుకుని పట్టణంలో ఉన్న ఇంటి వాల్యూతో బాండ్లు ఇచ్చారన్నారు. తిరుపతిలో రూ.170.99 కోట్లకు 29 బాండ్లు జారీ చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో అక్రమాలు జరగడంతో తాము వచ్చిన తర్వాత ఐదు నెలలు బాండ్లు జారీ నిలిపివేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 965 టీడీఆర్‌లు, విశాఖలో 266 టీడీఆర్‌లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. మూడు నెలల్లోగా టీడీఆర్ బాండ్ల అక్రమాలపై పూర్తి స్పష్టత ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ కింద చేపట్టిన ప్రాజెక్టులపై అసెంబ్లీలో మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. 2007లో ఎంఐజీ ఇళ్లు అభివృద్ధి చేసేలా రాజీవ్ స్వగృహ ప్రాజెక్ట్ తీసుకొచ్చామన్నారు. అనంతపురం, కర్నూలులో ప్రాజెక్ట్ పూర్తి అయిందని... మిగిలిన చోట్ల పెండింగ్‌లో ఉందన్నారు. మొత్తం 571.69 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ కొనసాగుతోందని తెలిపారు. ధరల విషయంలో మంత్రి వర్గ ఉపసంఘం పలు ప్రతిపాదనలు ఇచ్చిందన్నారు. అయితే పెండింగ్‌లో ఉన్న ఇళ్లను రద్దు చేయాలంటే న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్ట్ అమల్లో ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చించి ఎలా ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ వెల్లడించారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



హైదరాబాద్,టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక, 2.5 శాతం డీఏను రవాణా అండ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.డీఏ ప్రకటనతో ప్రతి నెల ఆర్టీసీపై 3.6 కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. ఇక, రేపు మహిళా దినోత్సవం నుంచి ఇది అమలులోకి వస్తుందని అని మంత్రి పొన్నం పేర్కొన్నారు. మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ఆడబిడ్డల అభివృద్ధే తెలంగాణ ప్రగతిగా రేపు ఇందిరా మహిళా శక్తి బస్సుల ప్రారంభం కానున్నాయి.అయితే, మండల మహిళా సమైక్య సంఘాల ద్వారా మొదటి దశలో 150 బస్సులు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీలోకి తీసుకోనుంది తెలంగాణ ప్రభుత్వం.

# తెలంగాణలో భానుడి ప్రతాపం...



హైదరాబాద్, మార్చి నెల ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోతున్నాయి. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇక, తెలంగాణలో ప్రతి రోజూ 35 డిగ్రీల సెల్సియస్‌పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతుంది. హైదరాబాద్ నగరంతో పాటు ఖమ్మం, భద్రాది కొత్తగూడెం, జనగామ, వికారాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతుంది. ఈ ఎండల తీవ్రతకి ప్రజలు బయటకు రావాలంటే భయ పడుతున్నారు. దీంతో ఒంటిగంట సమయంలో ప్రధాన రహదారులు నిర్మాను ష్యంగా కనపడుతున్నాయి.అయితే, గ్రేటర్ హైదరాబాద్ లో ఎండల తీవ్రత పెరిగింది. సాధారణం కంటే 4, 5 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. వడగాడ్పు లు కూడా తీవ్రంగా వీయనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ఏప్రిల్, మే నెలలో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా చెప్పుకొ చ్చింది. ఎండ తాపంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీంతో కూలర్లు, ఏసీలకు గిరాకీ పెరగ్గా.. మరి కొందరు మాత్రం పాత వాటికి రిపేర్లు చేయించుకుంటున్నారు. కాగా, వారం రోజులుగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలతో వ్యవసాయ,ఉపాధి హామీ కూలీలు, రోజు వారి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

# మోడీ నుంచి నేర్చుకున్న పాఠాన్ని రివీల్ చేసిన చంద్రబాబు



న్యూఢిల్లీ,గతంలో ముఖ్యమంత్రిగా పలుమార్లు పని చేసిన చంద్రబాబుకు.. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి సీఎం అయ్యాక ఆయనలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గతంలో సీరియస్ గా ఉండటం.. చతురతకు అవకాశం ఇవ్వకుండా ఉండటంతో పాటు.. తాను చేసిన తప్పుల్ని ఒప్పుకునే గుణం ఉండేది కాదు. కానీ.. ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా తనను ఉద్దేశించి చేసే విమర్శల్ని గుర్తిస్తున్నారు. తనను తాను గొప్పగా చెప్పుకునే పాత చంద్రబాబుకు.. ఇప్పటి చంద్రబాబుకు కాస్త తేడా ఉంది.ఎదుటివారిలోని గొప్పతనాన్ని గుర్తిస్తున్నారు. దాని గురించి మాట్లాడుతున్నారు. తాను నేర్చుకున్న పాఠాల్ని బయటకు చెప్పేందుకు సంకోచించటం లేదు. మొత్తంగా చంద్రబాబులో మారిన మనిషి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాడు. తాజాగా రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ప్లీనరీలో 'లిమిట్ లెస్ ఇండియా' అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనో ఆసక్తికర అంశాన్ని షేర్ చేశారు.మంచి పనులు చేయటంతో పాటు ప్రజలు మనవైపు ఉండేలా చూసుకోవటం చాలా ముఖ్యమని.. డెవలప్ మెంట్ మీద ఫోకస్ చేసి.. చేసే పని గురించి ప్రజలకు సరిగా చెప్పకపోతే.. ఎన్నికల్లో వారు ఓట్లు వేయకపోవచ్చన్న ఆసక్తికర విషయాన్ని చంద్రబాబు వెల్లడించారు. 2004, 2019లలో తాను డెవలప్ మెంట్ పనుల్లో మునిగిపోవటం వల్ల తాను ఓడిపోయానే తప్పించి.. ప్రతిపక్షాలు తనను ఓడించలేదన్నారు. ఈ విషయంలో తాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అభినందిస్తున్నట్లు చెప్పారు.మోడీ తాను అనుకున్న పనుల్ని చేయటమే కాదు.. స్థిరత్వాన్ని కొనసాగిస్తున్నారని.. ఇదెన్నో సమస్యల్ని పరిష్కరించినట్లుగా చెప్పారు. 'ఎన్నికల్లో ఓడిపోకూడదన్న పాఠాన్ని నేను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుంచి నేర్చుకున్నా' అంటూ తన మనసులోని మాటల్ని చెప్పుకొచ్చారు. భారత్ కు భవిష్యత్తులో హద్దులు ఉండవని తాను భావిస్తున్నట్లు చెప్పిన చంద్రబాబు.. మోడీ నాయకత్వంలో భారత్ 2047 నాటికి ఒకట్రెండు స్థానాలకు చేరుకుంటుందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు నంబర్ వన్ స్థానంలో ఉంటారన్నచంద్రబాబు.. 'ఈ రోజు నేను చెప్పిన మాటల్ని రాసి పెట్టుకోండి. ప్రస్తుతం మనమంతా యూదుల గురించి మాట్లాడుకుంటున్నాం. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా వారు అత్యంత ప్రభావం చూపే స్థితిలో ఉన్నారు. కానీ.. ఇప్పుడు ప్రపంచంలోని ఏ సంపన్న నివాస ప్రాంతాలకు వెళ్లి చూసినా అది భారతీయులదే అవుతుందని గర్వంగా చెప్పగలను. అమెరికాలోని భారతీయుల సగటు ఆదాయం ఇక్కడున్న మిగిలిన దేశాల వారి కంటే రెట్టింపు" అంటూ ఆసక్తికర అంశాల్ని వెల్లడించారు.

# వివాదంలో పటాన్ చెరు ఎమ్మెల్యే..



సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో అతడిపై పార్టీ హైకమాండ్ కి ఫిర్యాదు చేసేందుకు క్యాడర్ రెడీ అవుతుంది.నిన్న కాంగ్రెస్ పార్టీని తిట్టినట్లు సోషల్ మీడియాలో మహిపాల్ రెడ్డికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. అందులో, పార్టీని తిడుతున్న మహిపాల్ రెడ్డి ఎందుకు పార్టీలోకి వచ్చారని కాంగ్రెస్ క్యాడర్ ప్రశ్నిస్తున్నారు. అయితే, మరోవైపు గూడెం మహిపాల్ రెడ్డి మాత్రం ఆ వీడియోని మార్ఫింగ్ చేశారని చెబుతున్నారు.కాగా, మధ్యాహ్నం 2 గంటలకు అమీన్ పూర్ లోని పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ శ్రేణులు ప్రెస్ మీట్ పెట్టనున్నారు. అనంతరం, మధ్యాహ్నం గాంధీ భవన్ వెళ్లి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై పార్టీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ కి నాయకులు ఫిర్యాదు చేయనున్నారు. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తీరుపై రాష్ట్రంలోని పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసింది కాంగ్రెస్ క్యాడర్.

# తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాం..



హైదరాబాద్,ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు రేవంత్ రెడ్డి పాలనకు రెఫరెండం అని బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ తెలిపారు. డబుల్ ఎమ్మెల్సీ గెలిచాం..డబులింజన్ సర్కార్ ఖాయం అన్నారు. తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగా.. ఎదురులేని శక్తిగా ఎదుగుతామన్నారు. బీజేపీ చేసేదే చెప్తుంది, చెప్పింది చేస్తుందన్నారు. రాబోయే కాలంలో బీజేపీ గెలుపు కోసం పూర్తిగా ప్రణాళికబద్ధంగా ముందుకు పోతామన్నారు. రేవంత్ రెడ్డికి ఇంటి పోరు,హైకమాండ్ పోరు, ప్రజల హెూరు తగలిందని ఆయన విమర్శించారు. తెలంగాణలో పాలన పడకేసి, పట్టు సాధించుకోలేక ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.. ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో రేవంత్ రెడ్డి త్వరలోనే సెంచరీ కొట్టడం ఖాయం అని ఎద్దేవా చేశారు. కనీసం మంత్రి వర్గ విస్తరణ లేదు, ఎమ్మెల్సీల ఫైనల్ లేదు.. మిణుకు మిణుకు మంటూ కాంగ్రెస్ కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.ఇక, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రయత్నం చేశాయని ఎంపీ లక్ష్మణ్ చెప్పారు. తెలంగాణలో విద్యావంతులు, మేధావులు, టీచర్లు మార్పు కోరుకుంటారన్నది స్పష్టం అవుతోంది.. రాహుల్ గాంధీ అబద్దాల ప్రచారం ప్రజలు నమ్మడం లేదు.. సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి తెలంగాణలో ఉంది అని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను రేవంత్ రెడ్డి సాధారణ ఎన్నికలుగా మార్చారు.. ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తుంటే రేవంత్ ఎదురు దాడి చేస్తున్నారు.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది.. రాష్ట్రంలో మేం అధికారంలో లేము.. అయినా రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. బీజేపీలో సామాన్య కార్యకర్త సైతం జాతీయ అధ్యక్షుడు అయ్యే అవకాశం ఉందని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ వెల్లడించారు.

# చైల్డ్ ట్రాఫికింగ్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో కలకలం రేపిన చైల్డ్ ట్రాఫికింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. చైల్డ్ ట్రాఫికింగ్ కేసులో కీలక సూత్రధారి వందన అనే మహిళను అరెస్ట్ చేశారు.అహ్మదాబాద్ నుంచి పిల్లల్ని తీసుకొచ్చి హైదరాబాదులో అమ్మినట్లు గుర్తించారు. ఇక, హైదరాబాదులోని నలుగురు బ్రోకర్లకి నలుగురు పిల్లలని వందన అమ్మినట్లు విచారణలో తేలింది. ఒక్కొ పిల్లకి ఐదు లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. అయితే, అహ్మదాబాద్ కు చెందిన వందనను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కు వందనను తీసుకొచ్చి రిమాండ్ చేశారు. దీంతో వందనను 5 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును పోలీసులు కోరారు.

## సంపాదకీయం

**శనివారం 08-03-2025**

# మహిళలకు అగ్రాసనంతోనే అభవృద్ధి !

ఏటా ప్రపంచ మహిళా మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నా..భారత్‌లో మాత్రం ఇంకా మహిళా సాధికారత రావడం లేదు. మహిళను విలాసవస్తువుగానే చూస్తున్నారు. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా.. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్య పెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వ మే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందన డంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. మహిళల రక్షణకు మరిన్ని కఠిన చట్టాలు తీసుకుని వస్తే తప్ప వారికి రక్షణ కల్పించలేం. హత్యలు, అత్యాచారాలు నిరోధానికి పాలకులు కఠినంగా వ్యవహరించడం లేదు.మహిళలను గౌరవించే మనదేశంలో మహిళల కోసం ఏం చేశారంటూ ఏమీ లేదు.ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేయడం మాత్రం అభినందించాల్సిందే. ఘనత వహించిన మోడీకి ఇవన్నీ తెలియనివి కాదు. మహిళా బిల్లును ఆమోదించినా..అది అందని ద్రాక్షగా మిగిలింది. జనాభా లెక్కల సేకరణ తరవాత డీ లిమిటేషన్‌తో దానికి లంకె పెట్టారు. దీంతో మరో రెండుమూడేళ్లు వేచిచూడక తప్పదు. ప్రధానంగా మహిళలకు ఉద్యోగ,ఉపాధి హామీల్లో పెద్దపీట వేయాలి. అలాగే వారికి ఉచిత విద్యను అందచేయాలి. ఉన్నత చదువులకు వెళ్లే వారికి వడ్డీరహిత రుణాలు అందించాలి. మహిళా సదస్సులు నిర్వహిస్తూ....మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. ఆడపిల్లల చదువులకు, క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏవీ అమలు కావడం లేదు.ఆడపిల్లల చదువులకు ప్రత్యేక రుణాలు, వడ్డీలేని పథకాలు అమలుచేసివుంటే బాగుండేది. ఉద్యోగాలు లేవు. చదువుకునే మహిళలకు కకనీసం ఫ్రీ చదువులు లేవు. విద్యా రుణాలు తీసుకుంటే కనీసం వడ్డీ మాఫీ గురించి కూడా ఆలోచన చేయడం లేదు. అలాచేసివుంటే బేటీపడావో..బేటీ బచావోకు అర్థం ఉండేది. ఆర్థిక మంత్రిగా ఓ మహిళ ఉన్నా మహిళలకు ప్రత్యేకంగా ఒనగూరుతున్న ప్రయోజనం లేదు. తక్షణం మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో అధికార విపక్ష సభ్యులు ఉమ్మడిగా విఫలం అయ్యారు. బిల్లును పాస్ చేసినా అమలు కాకుండా అటకెక్కించారు. ఈ బిల్లుతో రాజకీయ లబ్ది పొందాలనలన్న బిజెపి ఎత్తుగడ మాత్రం ఫలించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా ఏటేటా జరుపుకుంటున్నా...మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే ఇంతకాలం అడ్డుకున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. చట్టసభల్లో కనీసం వారి అభిప్రాయా లకు విలువను ఇచ్చినట్లుగా ఉంటే బాగుండేది. కానీ అలా జరగడంలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకుంటున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. సమాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే అత్యాచారం చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగిపోతున్నారు. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలి.

భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా తగినంతగా ప్రోత్సాహం మాత్రం దక్కడం లేదు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ,పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల దక్కితేనే మరింతగా రాణిస్తారు. వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారం అవుతున్నాం. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. అన్నిరంగాల్లో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. అలాగే చదువుకునే అమ్మాయిలకు ఉచిత విద్యా రుణాలు అందాలి. అలాగే వారి ఉన్నత విద్యకు ప్రభుత్వాలు చేయూత నివ్వాలి. బేటీపడావో . . బేటీ బచావో నినాదం కార్యరూపం దాల్చాలి. మహిళలను విలాసవస్తువుగా చూసే సంస్కృతిపై కఠినంగా వ్యవహరించాలి. అత్యాచారాలు, వేధింపులపై కఠినంగా వ్యవహరించేలా చట్టాలు రావాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికార పక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన మన సంస్కృతిని ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో సమాజం వారిపట్ల గౌరవభావంతో సాగాలి. విద్యా,క్రీడా, సాంస్కృతిక రంగాల్లో వారిని ముందుకు నడిపించేలా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలి. అప్పుడే మనం ఆశించిన మహిళాభ్యుదయం సాకారం అవుతుంది. అలాగే మహిళల పట్ల అకృత్యాలకు పాల్పడే మృగాళ్లను కఠినంగా శిక్షించాలి. అవసరమైతే ఉరిశిక్షలకు కూడా వెనకాడరాదు. వరకట్న వేధింపులు వంటివి లేకుండా చూడాలి. పనిప్రదేశాల్లో రోణ కల్పించాలి. ఇవన్నీ కూడా అమలుకు కఠిన చట్టాలే శరణ్యం.

# బీమా పాలసీలపై జీఎస్టీ దందా !




న్యూఢిల్లీ,పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిదశ ముగిసింది. మలిదశ సమావేశాలు మార్చి పదినుంచి పక్షం రోజులు జరుగనున్నాయి. ఇవే అత్యంత కీలకమైన రోజులు. విపక్షానికి ఇది నిజంగా పరీక్షాకాలం. వారు అనేకానేక సమస్యలను లేవనెత్తడానికి అవకాశం కొనితెచ్చుకోవాలి. గొడవలతో బాయ్‌కాట్లతో సమస్యలు పరిష్కారం కావు. ఇందులో అత్యంత ప్రధానమైనది జిఎస్టీ అని గుర్తించాలి. జిఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న బాదుళ్లను చర్చించాలి. ఎందుకంటే అధికార పార్టీ కాబూలీవాలాల లాగా వసూళ్లకు తెగిస్తోంది. పదేళ్లుగా పోరాటం చేస్తే..ఆదాయపు పన్నును 12 లక్షలకు చేర్చినా అందులోనూ మెలికలే పెట్టారు. మధ్యతరగతి ప్రపజలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఆర్థిక అంశాలపై పార్లమెంట్‌లో చర్చించడం లేదు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి మాత్రమే తమ వాదనలు చేస్తోంది. బిజెపి ఎంపిలు కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టి పెట్టుకోవడం లేదు. కుక్కిన పేనుల్లా మోడీ ముందు మోకరిల్లుతున్నారు. ఆహా మోడీ..ఓహో మోడీ అంటూ భజనలు చేయడానికే సమయం కేటాయిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడా చర్చ చేయడం లేదు. ఎవరైనా చర్చించినా దానిని పట్టించుకోవడం లేదు. అంతెందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎదురుదాడితో విపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. జిఎస్టీపై గత పార్లమెంట్ సమావేశాల్లో ఆమె చేసిన ఎదురుదాడి ప్రసంగమే ఇందుకు నిదరర్శనం. జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వ 18 శాతం జిఎస్‌టి విధించడం అత్యంత దుర్మార్గం. ఆపద వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఆ కష్టాన్ని సైతం ఖజానాను నింపుకోవడానికి మార్గంగా చూడటం అమానుషం! సొంత పార్టీ నుండే వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, సీనియర్ నేతలే ఈ నిర్ణయాన్ని తప్పు పడుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం కష్టకాలంలోనూ ప్రజల మూలుగులను పీల్చి పిప్పి చేయాలనే భావిస్తోంది. అందుకే ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని టాక్స్ టెర్రరిజంగా అభివర్ణిస్తున్నాయి. జిఎస్‌టిలో వివిధ వస్తువులు, సేవలపై సున్నా నుండి గరిష్టంగా 28 శాతం వరకు పన్నులు విధించవచ్చు. ఈ పట్టికలో చివరి నుండి రెండవ స్థానంలో ఉన్న 18 శాతం జిఎస్‌టిని బీమాపై పాలసీలపై విధిస్తున్న కేంద్రం బంగారం పై మూడు శాతం, వజ్రాలపై 0.25 శాతం మాత్రమే పన్ను వసూలు చేస్తుండటం గమనార్హం. కొన్ని సంవత్సరాలుగా బీమా కంపెనీలు రకరకాల కారణాలు చెబుతూ ప్రీమియం మొత్తాలను ఇష్టా రాజ్యంగా పెంచుతున్నాయి. ఈ పెంపును నియంత్రించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. రెండు సంవత్సరాల క్రితం 22 సంవత్సరాలున్న ఒక వ్యక్తి ఐదు లక్షల రూపాయల బీమా మొత్తానికి పది వేల రూపాయలు ప్రీమియంగా చెల్లించే పరిస్థితి ఉంటే, గతేడాది ఆ ప్రీమియం 15 వేల రూపాయలకు చేరింది. ఇదే తలకు మించిన భారంగా మారుతుండటంతో అనేక మంది తమ పాలసీలను రద్దు చేసుకుం టున్నారు. ఇప్పుడు 18 శాతం జిఎస్‌టి విధించడంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా దీనిని లేవనెత్తినా..ఆయనను ఈగలాగా తీసిపారేశారు. ఆయన సూచనలకు విలువనివ్వలేదు. దీంతో పాలసీలపై పడే భారం మరింత పెరుగుతుం దన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా ఉన్నప్పటికీ రోగగ్రస్థ దేశంగా మారే ప్రమాదం ఉంది. ఆరోగ్య పాలసీలను పక్కన పెట్టి ప్రభుత్వం ఇచ్చే ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆరోగ్యశ్రీలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇది కాస్తా కార్పొరేట్ ఆస్పత్రులను ప్రోత్సహించేలా మారుతోంది. నయా ఉదారవాద విధానాలు అమలు చేస్తున్న పాలక వర్గాలు ఒక వ్యూహం ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. వైద్య సేవల కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడక తప్పని స్థితిని సామాన్యులకు కల్పించాయి. ప్రైవేటు రంగానికి లాభాల లెక్కలే కీలకం కావడంతో వైద్యం సాధారణ ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ వైద్య రంగాన్ని తిరిగి పట్టాలెక్కిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెబుతున్నప్పటికీ ఆచరణలో అవి అమలుకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితే వైద్య రంగంలో బీమా ఆవశ్యకతను పెంచాయి. గతేడాది ప్రారంభంలో దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో లండన్ స్కూల్ ఆఫ్ హైజిన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ సంస్థ టి.బి రోగులపై ఒక సర్వే నిర్వహించగా 30 నుండి 61 శాతం మంది ఆర్థిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో చికిత్సను తీసుకోలేకపోయారని తేలింది. వీరికి ఆరోగ్య బీమా ఉండి ఉంటే పరిస్థితి మెరుగ్గా ఉండేదని ఆ సంస్థ పేర్కొంది. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నప్పటికీ దేశ వ్యాప్తంగా 2021 గణాంకాల ప్రకారం 40 కోట్ల మంది ఎటువంటి ఆరోగ్య బీమా లేకుండా ఉన్నారు. మరోవైపు ప్రభుత్వ బీమా పథకాలకు నిధుల కొరత వెంటాడుతుండటంతో అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు వైద్య సేవలను నిరాకరిస్తున్నాయి. తాజా గణాంకాల ప్రకారం నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ బారిన పడి దేశంలో ఏటా 58 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. మెర్సర్ మార్ష్ బెనిఫిట్స్ (ఎమ్ఎమ్‌బి) హెల్త్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం ఆసియా ఖండంలోని మెడికల్ క్లయిమ్‌లలో 55 శాతం క్యాన్సర్, 43 శాతం రక్తప్రసరణ వ్యవస్థ ఆధారిత వ్యాధులు ఉంటున్నాయి. మన దేశంలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. జీవన శైలిలో మార్పులు, పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కారణంగా ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలను కొనుగోలు చేయడం తప్పనిసరి అవసరంగా మారింది. ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంల పైనే ప్రభుత్వానికి గత ఆర్థిక సంవత్సరంలో 8,263 కోట్ల రూపాయలు వసూలైందని ఆనాటి కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. అది చాలదన్నట్లు మరింతగా ప్రజల నుండి వసూళ్లు చేయాలని కేంద్రం భావిస్తోంది. 18 శాతం జిఎస్‌టి విధించడం ద్వారా ఏటా 24 వేల కోట్ల రూపాయలు కేంద్ర బొక్కసానికి చేరుతున్నాయని అంచనా! ప్రజల రక్త మాంసాలతో ఖజానాను నింపాలని చూడటం సబబు కాదు. దుర్మార్గమైన ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరిచుకోవాలి. దీనిపై పోరాటం ఒక్కటే శరణ్యం. లేదా దీనిపై కేంద్రమే ఓ నిర్ణయం తీసుకుని జీవితబీమా, ఆరోగ్య బీమా పాలసీలపై జిఎస్టీ ఎత్తేయాలి. పేద, మధ్య తరగతి ప్రజలు రక్తమాంసాలు వెచ్చించి కడుతున్న పాలసీలపై జిఎస్టీ విధించడం దుర్మార్గం కాక మరొటి కాదని మోడీ ప్రభుత్వం గుర్తించాలి.

# పేదల బియ్యం పక్కదారి!



హైదరాబాద్,తెలంగాణ పౌర సరఫరాల శాఖ అలసత్వం కారణంగా రేషన్ బియ్యంపై ఆధారపడే పేదలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు, ధాన్యం అమ్ముకునే రైతులు నానా యాతనలు పడుతున్నారు. ధాన్యం సేకరణ పేరుతో గతేడాది వందల కోట్ల అవినీతి జరిగింది. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించటానికి.. క్వింటాల్‌కు రూ.2,100కు కొనుగోలు చేయటానికి మిల్లర్లు సుముఖత చూపించినప్పటికీ ప్రభుత్వం గ్లోబల్ టెండర్లను పిలిచింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత, పౌరసరఫరాల శాఖ మంత్రి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం జరుగుతున్నది.ధాన్యం సేకరణలో గ్లోబల్ టెండర్ల పేరుతో తమకు నచ్చిన కంపెనీలకే టెండర్లు వచ్చే లా చేసిన ప్రభుత్వం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన సంస్థలను సైతం మళ్లీ ధాన్యం సేకరణకు అనుమతిస్తున్నది. ఈ కంపెనీలు ధాన్యం సేకరణలో తప్ప, ఇతర ఆర్థిక విషయాల్లో తలదూర్చకూడదు. కానీ, ఈ కంపెనీలు నేరుగా రైస్ మిల్లర్లతో సంప్రదింపులు చేపడుతున్నాయి. వాళ్ల మాట వినకపోతే గోదాముల్లోని ధాన్యాన్ని సేకరించమని బెదిరింపులకు పాల్పడుతున్నాయి. తక్కువ ధరకు కోట్ చేసిన ఈ కంపెనీలు రైస్ మిల్లర్లు ఎక్కువ చెల్లించాలని, పౌర సరఫరాల శాఖలో అత్యున్నత వ్యక్తులు తమకు తెలుసునని చెప్పుకొంటున్నాయి.ఇదంతా పౌర సరఫరాల శాఖ కనుసన్నల్లోనే జరుగుతున్నది. క్వింటాలుకు అదనంగా రూ.236 చెల్లిస్తేనే ధాన్యాన్ని తీసుకుపోతామంటున్న కంపెనీల వెనుక కచ్చితంగా రేవంత్‌రెడ్డి హస్తం ఉండే ఉంటుంది. తమకు సహకరించని రైస్ మిల్లులపై విజిలెన్స్, జీఎస్టీ దాడులు జరుగుతాయంటున్నారు. కొన్నిసార్లు ధాన్యాన్ని తీసుకుపోయినట్టు పత్రాలు సృష్టిస్తున్నారు. గతేడాది లెక్కల ప్రకారం 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించటానికి టెండర్లు పిలిచారు. అదనంగా వసూలుచేసిన మొత్తం రూ. 820 కోట్లు. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి ముడుపులుగా ముడుతున్నాయన్నది నూటికి నూరుపాళ్లు నిజం. ప్రతిసారి మూడు నెలల్లో లిఫ్ట్ చేయాల్సిన ధాన్యాన్ని ఆరు నెలలైనా లక్ష్యాన్ని చేరుకోకపోవటానికి కారణం కొందరు మిల్లర్లు ఈ అదనపు మొత్తాన్ని ఇవ్వటానికి నిరాకరించటమే.లక్ష్యాన్ని చేరుకోలేకపోయిన కంపెనీలను ఏ ప్రభుత్వమైనా వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమకు రావాల్సిన రూ.820 కోట్ల కోసం ఆలోచించి గోదాముల్లో ధాన్యం ముక్కిపోయి, పాడైపోయేలా చేస్తున్నది. రేంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమార్జన కోసం విలువైన ధాన్యాన్ని నాశనం చేస్తున్నది.పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టే ఉద్దేశంతో సన్న బియ్యాన్ని అందించాం. మధ్యాహ్న భోజన పథకానికి 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరమవుతాయి. దీనికోసం టెండర్లు పిలిస్తే ధాన్యం సేకరణ కోసం ఎంపికైన ఆ నాలుగు కంపెనీలే వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరాకు ముందుకువచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర రూ.45 ఉండగా ఈ కంపెనీలు మాత్రం రూ.57తో టెండర్లు వేశాయి. అంటే 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరాలో రూ.300 కోట్ల అవినీతి జరిగినట్టే లెక్క. ఈ సంస్థలు ఇప్పటివరకూ సంక్షేమ వసతిగృహాలకు నాసిరకం ధాన్యాన్ని సరఫరా చేస్తున్నాయి.అందుకే ఎన్నడూ లేనివిధంగా వసతిగృహాల్లో విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారు. సుమారు 3 లక్షల మంది విద్యార్థులకు సన్న బియ్యం పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ, విద్యార్థుల సంక్షేమం ఏ మాత్రం పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం బియ్యంలోనూ భూతద్దం పెట్టి మరీ అవినీతిని వెతుక్కుంటున్నది. మామూలుగా అయితే వంద కిలోల ధాన్యాన్ని మిల్లులకు ఇస్తే 67 కిలోల బియ్యాన్ని మిల్లర్లు పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తే ఆ శాఖ ఎఫ్‌సీఐకి అందిస్తుంది. కానీ, గ్లోబల్ టెండర్ల ద్వారా వచ్చిన సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కావాలనే ఆలస్యం చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వం నుంచి నిధులు పొందినప్పటికీ బియ్యాన్ని మాత్రం లిఫ్ట్ చేయకుండా ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు.మరోవైపు రేషన్‌కార్డుల జారీపైనా ప్రభుత్వం దాగుడు మూతలాడుతున్నది. అలవికానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 15 నెలలు దాటుతున్నా ఇంతవరకూ జారీపై ఎలాంటి నిర్దిష్ట ప్రకటన చేయలేదు. ప్రజలు ఆశతో నాలుగుసార్లు దరఖాస్తులు సమర్పించారు. ప్రజాపాలన, గ్రామసభల్లో కలిపి సుమారు లక్షన్నర దరఖాస్తులు వచ్చాయి. కొత్తవారికి రేషన్‌కార్డుల జారీ, పాత వారిని తొలగింపుపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలి. సంక్షేమ వసతి గృహాలకు, పేదలకు అందించే రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడకుండా ఉండాలి. గ్లోబల్ టెండర్ల పేరుతో నాలుగు కంపెనీలకు అప్పగించిన గుత్తాధిపత్యాన్ని వెంటనే రద్దు చేయాలి.

### తాగునీటిని ఇతర అవసరాలకు వాడితే జరిమానా

సిద్దిపేట,వాటర్‌బోర్డు సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించిన ఘటన జూబ్లీహిల్స్‌లో బుధవారం చోటుచేసుకుంది. వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా రోడ్డు నంబర్ 78లో నీరు లీకేజీ అవుతున్నట్లు గమనించాడు. స్థానిక జీఎం హరి శంకర్‌ను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో ఆయన మేనేజర్‌తో కలిసి అక్కడికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి వాటర్‌బోరు సరఫరా చేసే నీటితో బైక్‌ను కడుగుతున్నాడు. ఈ విషయాన్ని ఎండీకి వివరించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి నోటీసు అందించి రూ.వెయ్యి జరిమానా విధించారు. తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్, ఇళ్ల పరిసరాలను కడగడానికి వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## అడుగంటుతున్న భూగర్భ జలాలు

పెద్దపల్లి, రోజురోజుకూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో ఒక వైపు బోర్లు ఎత్తిపోతుండగా.. మరో వైపు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. దీంతో సాగు కష్టాల్లో, ఆర్థిక నష్టాల్లో రైతులు కూరుకుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పెద్దపల్లి జిల్లాపై కుండగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చుక్కనీరు లేకపో వడంతో బోర్లు, బావులు అడుగంటుతున్నాయి. దీంతో రైతులు తిరిగి బోర్లు వేసుకోవడం, బావులను పూడిక తీయడం లాంటి పనులను చేపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తలాపున పారుతున్న గోదావరి నీ సేను నీ సెలుక ఎడారి అని స్థానిక కవి రచయిత మల్లావజ్జల సదాశివుడు మూడు దశాబ్ధాల క్రితం తెలంగాణ సాగు నీటి కష్టాలను ఏకరువు పెట్టగా పదేళ్ల తర్వాత తిరిగి అదే పరిస్థితులు నెలకొనడంతో కాంగ్రెస్ పాలన వచ్చింది కష్టాలను వెంట బెట్టుకొని వచ్చిందనే విధంగా పాలన సాగుతుండటంతో రైతుల్లో అసహనం వ్యక్తం అవుతున్నది. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల్లో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. 2023 ఫిబ్రవరి నెలలో భూగర్భజలాలు 5.47మీటర్ల లోతులో ఉండగా 2024ఫిబ్రవరి మాసంలో 5.09మీటర్ల లోతులో, 2025 ఫిబ్రవరి మాసంలో 5.44మీటర్ల లోతులోకి పడిపోయాయి. బీఆర్ఎస్ పార్టీతో కక్షతో కాళేశ్వరంను పక్కన పెట్టి తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో మోటార్లతో పని లేకుండానే కాలువల్లో సాగు నీరు పారిందని, కాళేశ్వరం గేట్లు ఎత్తడంతో బోర్లన్నీ ఎత్తిపోయి బోర్లల్లో కూడా చుక్క నీరు రావడం లేదని మూడేళ్ల దాకా ఇక సాగు అంతేనా..? అలాగైతే తాము ఎలా బ్రతుకుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీలో సీన్ రిపీట్ !

విజయవాడ:ఏపీలో మూడు ప్రాంతీయ పార్టీల వ్యవస్థ దిశగా రాజకీయం సాగుతోంది. ఇందులో తెలుగుదేశం పార్టీది సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర. వైసీపీ జనసేన ఇంచుమించుగా ఒకేసారి ఆవిర్భవించాయి. వైసీపీ అయితే అధికారాన్ని అందుకుంది. జనసేన వెయిటింగ్ లిస్ట్ లో ఉంది. ఈ మూడు పార్టీలు విడిగా పోటీ చేస్తే వైసీపీకి మేలు అన్నది 2019 ఎన్నికలు తేటతెల్లం చేశాయి.టీడీపీ జనసేన కలిస్తే వైసీపీకి చేటు అన్నది 2024 ఎన్నికలు కళ్ళకు కట్టి మరీ చూపించాయి. వైసీపీ జనసేనను టార్గెట్ చేయడం వల్లనే చాలా సులువుగా టీడీపీ జనసేన కలిసిపోయాయని కూడా పొలిటికల్ పండిట్స్ అభిప్రాయపడ్డారు. ఇక ఓటమి తరువాత వైసీపీ టీడీపీనే టార్గెట్ చేస్తూ వచ్చింది. జనసేనను పక్కన పెట్టింది.కానీ లేటెస్ట్ గా చూస్తే జనసేనను వైసీపీ మళ్ళీ టార్గెట్ చేస్తోంది. పైగా పవన్ ని కూడా విమర్శిస్తున్నారు. అయితే పవన్ వైసీపీని విమర్శించలేదా అని అడగవచ్చు. కానీ రాజకీయంగా వ్యూహాత్మకంగా ఆలోచిస్తే పవన్ వైసీపీని విమర్శించినా వైసీపీ నుంచి పవన్ ని విమర్శించకపోవడమే ఆ పార్టీకి మేలు అని అంటున్నారు.కానీ వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ అయితే తాజాగా పవన్ మీద హాట్ కామెంట్స్ చేశారు. ఆయన స్థాయి కార్పోరేటర్ కి ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అని విమర్శించారు. దీంతో రాజకీయ రచ్చ మళ్ళీ రాజుకుంది. పవన్ ని విమర్శించడం అంటే ఆయన వెనకాల ఉన్న బలమైన సామాజిక వర్గాన్ని కూడా టార్గెట్ చేయడమే అని వైసీపీ మరచిపోతోంది అంటున్నారు. నిజానికి చూస్తే కూటమిలో జనసేన టీడీపీల మధ్య పొరపొచ్చాలు ఉన్నాయని ప్రచారంలో ఉంది. గ్రౌండ్ లెవెల్ లో కూడా రెండు పార్టీల క్యాడర్ మధ్యన గ్యాప్ ఉంది. పోటా పోటీగా కొన్ని చోట్ల ఉంది. ఈ క్రమంలో అయిదేళ్ళ తరువాత ఎన్నికల్లో ఏమైనా జరగవచ్చు. రాజకీయాల్లో ఎన్నో అవకాశాలు ఉంటాయి.కానీ వైసీపీ టీడీపీతో పాటు జనసేనను కలిపి కట్టి విమర్శించడం రాజకీయంగా తప్పుడు వ్యూహమే అని అంటున్నారు. ఇలా చేయడం వల్ల మళ్ళీ క్షేత్ర స్థాయిలో రెండు పార్టీలు ఒక్కటి కావడానికి చాన్స్ ఉంటుందని అలాగే సామాజిక రాజకీయ పరమైన పోలరైజేషన్ కోస్తా జిల్లాలలో మరింత బలంగా సాగుతుందని అది అంతిమంగా వైసీపీకే దెబ్బ అని అంటున్నారు.ఇదిలా ఉంటే జగన్ పవన్ ని విమర్శించగానే మంత్రి నారా లోకేష్ అందుకుని ఉప ముఖ్యమంత్రిని కించపరుస్తారా అని గట్టిగా జగన్ మీద విరుచుకుపడడాన్ని గమనించాల్సి ఉంది. జగన్ పార్టీ కంటే పవన్ కి సీట్లు మెజారిటీలు ఎక్కువ వచ్చాయని ఆయన లెక్క చెప్పారు. పవన్ ని విమర్శించారు అని వైసీపీని కౌంటర్ చేస్తూ జనసేనను వెనకేసుకుని రావడం ద్వారా టీడీపీ జనసేనను తమతోనే ఉంచుకుంటోంది.మరి వైసీపీ పెద్దలు ఈ విషయంలో కాస్తా నిదానంగా ఆలోచిస్తే బాగుంటుంది కదా అని అంటున్నారు. పవన్ ని ఒక బలమైన సామాజిక వర్గం తమ ప్రతినిధిగా చూస్తోంది. అలాగే ప్రాంతాలు కులాలు మతాలతో సంబంధం లేకుండా యువత మహిళలలో పవన్ కి క్రేజ్ ఉంది. దాంతో ఆయనను విమర్శించడం ద్వారా వైసీపీ రాజకీయంగా లాభం సంగతేమో కానీ నష్టమే పొందుతుందని అంటున్నారు.

## నవోదయ పాఠశాలలు తెస్తే పట్టిచుకోరా

నిజామాబాద్,కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా.. సిఎం రేవంత్ రెడ్డి అవన్నీ మరచి ..కేంద్రం ఇస్తోంది.. కానీ కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని చేసిన వ్యాఖ్యలు సత్యదూరమని నిజాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.. ఇటీవల ఓ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘తెలంగాణకు మోడీ 7 జవహర్ నవోదయ విద్యాలయాలు ఇచ్చారు. నా పార్లమెంట్ పరిధిలో జగిత్యాల, నిజామాబాద్ లో ఒకటి చొప్పున రెండు వచ్చాయి. పార్టీలకతీతంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కూడా మాట్లాడాను. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎక్కువగా చేరుతారు కాబట్టి జిల్లా కేంద్రంలో పెట్టాలని నిర్ణయించాం. నిజామాబాద్ లో స్టార్ట్ అయింది.. ఆర్లెడీ కొనసాగుతోంది. బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆర్మూర్ లో పెట్టాలని ప్రెజర్ పెడితే నేను ఆయన్ను ఒప్పించుకున్నా. అన్నీ ఒకే అనుకున్నాక బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీ ల్యాండ్ ఇచ్చారు. ఆ ల్యాండ్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరవనట్టేనా. వీళ్లకు పని చేయడం చేతకాదు. చేస్తున్న వారిని చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారు. సుదర్శన్ లెటర్ హెడ్ కూడా కొట్టించుకోవడం లేదు. మంత్రి పదవి ఇచ్చాకే లెటర్ హెడ్ సిద్ధం చేసుకుంటాడట. ఆయనకు మతిస్థిమితం లేకుండా పోయిందని అననారు. పనికిమాలిన రాజకీయాలతో మంచి ఇనిస్టిట్యూట్ లు రాకుండా పోతున్నాయి. గల్లీ లీడర్ లాగా మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇంకా బుద్ధిలేకుండా మంత్రి పదవి కావాలని కోరుతున్నారు. నయా పైసా పని చేయడని కేవలం మైనార్టీ ఓట్లతో గెలుస్తున్నాడని ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించారు.మంత్రి శ్రీధర్ బాబు మేము పరిశీలిస్తున్నామన్నాడు.. ఇదేనా పరిశీలించడం అని బీజేపీ ఎంపీ ప్రశ్నించారు. ‘మీకు నేను స్కూల్ తెస్తుంటే ఇలా బురదజల్లుతారా?. సుదర్శన్ రెడ్డి మెదడు మోకాలుకు జారింది.. ఇప్పుడు అరి కాళ్లకు జారుతుంది. చటాకు మెదడు ఉన్న ఎవడైనా మోడీతో మంచిగా ఉంటాడు. ట్రంప్ లాంటి వ్యక్తే మోడీతో మంచిగున్నాడు. కుర్చీలో దగ్గరుండి కూర్చోపెడుతున్నాడు. రేవంత్ ఒక లెక్కనా. రేవంత్ వస్తానంటే బీజేపీలోకి ఆహ్వానిస్తాం. దానికి ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం. రాహుల్ గ్రహాంతరవాసి. సీఎం పదవి తొలగిస్తే రేవంత్ చూస్తూ ఊరుకుంటాడా? నిజంగా అదే జరిగితే వ్యక్తిగతంగా బీజేపీలోకి ఆహ్వానిస్తా. ఆయన్ను తీసుకుంటారా? లేదా అనేది మాత్రం నా చేతిలో లేదు. కిషన్ రెడ్డిని తిట్టాడు

## వ్యవసాయరంగం బలోపేతం ముఖ్యం

న్యూఢిల్లీ, ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేస్తున్న విధానాల కారణంగా, పాలకులక తప్పులకు బాధ్యులు ఎవరన్నది చెప్పాలి. కార్పొరేట్ల కొమ్ము కాస్తే అది ప్రజలకు భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టుల కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. అందుకే ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వ్యవసాయరంగంలో మనం ముందున్నాం. ప్రపంచానికి అన్నం పెట్టే స్థాయి మనది. అది మరచి విదేశీ పెట్టుబడుల కోసం దేబురించడం సరికాదు. కార్పొరేట్లకు చేసే మేలు వల్ల సామాజిక బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడలేరు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది. 1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుంచి పక్కకు తప్పు కోవటం, ప్రజలకు కావలసిన ప్రతి అవసరాన్ని సరుకుగా చూడడం మొదలు పెట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32 సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా మారిపోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో వుండగా.... భారతదేశ ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది. అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు రంగానికి కేటాయింపులు చేసేలా ఒత్తిడి తెచ్చింది. దాని ఫలితంగానే నేడు అనేక సర్వదరిద్రాలు వచ్చాయి. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీపై కోతను విధిస్తోంది. ధరలు పెంచుతోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వరంగ సంస్థలుగా ఉన్న అన్నీ... ప్రైవేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెబుతోంది. దీనివల్ల భవిష్యత్తు లో యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్‌మెంట్‌కు కూడా రుసుం చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్న తీరు ప్రజలకు భారంగా మారుతోంది.

## బీజేపీ కోవర్టు అంటూ కాంగ్రెస్ ఫైర్

న్యూఢిల్లీ,దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీపై సొంత పార్టీ నేత, మాజీ కేంద్రమంత్రి మణిశంకర్ అయ్యర్ వ్యక్తిగత విమర్శలకు దిగారు. రాజీవ్ గాంధీ రెండు సార్లు చదువులో ఫెయిల్యూర్ అయ్యారని..అయినా కూడా ఆయన ప్రధానమంత్రి కావడం ఆశ్చర్యం కలిగించిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. బీజేపీ అస్త్రంగా మార్చుకుంది.

మణిశంకర్ ఏమన్నారంటే..

రాజీవ్‌గాంధీ కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యషించేటప్పుడు రెండు సార్లు విఫలం చెందారని తెలిపారు. యూనివర్సిటీ ఇమేజ్‌ను నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఉత్తీర్ణులవుతారని.. కానీ కేంబ్రిడ్జ్‌లోనూలండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలోనూ రెండు చోట్ల రాజీవ్ గాంధీ ఫెయిల్యూర్ అయ్యారన్నారు. అలాంటి వ్యక్తి.. దేశానికి ప్రధానమంత్రి అయినప్పుడు తాను చాలా ఆశ్చర్యపోయానని మణిశంకర్ అయ్యర్ పేర్కొన్నారు. ప్రస్తుతం మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. బీజేపీ కోవర్టుగా మారి వ్యక్తిగత విమర్శలకు దిగారని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ అయ్యర్ మండిపడ్డారు. అయినా చదువులో వైఫల్యం చెందడం పెద్ద విషయం కాదని%ో% ఉత్తమ వ్యక్తులు కూడా కొన్నిసార్లు విఫలమయ్యారని చెప్పుకొచ్చారు. రాజీవ్.. చదువులో విఫలం అయి ఉండొచ్చు కానీ రాజకీయాల్లో విఫలం కాలేదు కదా? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో రాజీవ్ గాంధీ విజయవంతమయ్యారని తారిఖ్ అన్వర్ అయ్యర్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన విధానాలను గుర్తుచేశారు. రాజీవ్ హయాంలోనే పంచాయతీ రాజ్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. అలాగే ఆయన వల్లే ఐటీ విప్లవం వచ్చిందన్నారు. అంతేకాకుండా కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచారని చెప్పారు. అలాగే శాస్త్రీయ పురోగతిని ప్రోత్సహించారని.. కేవలం ఐదు సంవత్సరాల్లోనే ఇంత గొప్ప విజయాలను రాజీవ్ సాధించారని గుర్తుచేశారు.మణి శంకర్ అయ్యర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి చరణ్ సింగ్ సప్రా కూడా ఖండించారు.కాంగ్రెస్‌లో ఉంటూపార్టీ ప్రతిష్ట ను పదే పదే దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. యూపీఏ హయాం లో కేంద్రమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం భావ్యం కాదని ఆరోపిం చారు. బీజేపీకి తొత్తుగా మారి.. లేనిపోని కథనాలు సృష్టిస్తున్నారని.. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత ఇదేనా? అని ప్రశ్నించారు. బహుశా వార్తల్లో ఉండేందుకు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటప్పుడు.. కాంగ్రెస్‌లో ఎంపీగా ఎందుకయ్యారని.. కేంద్రమంత్రిగా ఎందుకు పని చేశారని నిలదీశారు.

## విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం

అమరావతి, విద్యాసంస్థల్లో పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని మంత్రి లోకేశ్ అన్నారు కళాశాల విద్యార్థుల ఆత్మహత్యలపై శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. పలు సమస్యలతో పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ర్యాగింగ్, ఒత్తిడి, ఫీజుల చెల్లింపు వల్ల ఎక్కువగా పిల్లలు ఆత్మహత్యలకు కారణాలవుతున్నాయన్నారు. పాఠశాల విద్యలోనూ మానసికంగా వేధిస్తున్నారనే అంశాలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు.స్కూళ్లలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నామని నారా లోకేష్ అన్నారు. పిల్లల్లో విద్యాపరంగా ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం చాలా సీరియస్‌గా భావిస్తుందని పేర్కొన్నారు. ఆత్మహత్యలపై నివారణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలపైనా ఉందని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు 12 లక్షల మంది పిల్లలు దూరమయ్యారని అన్నారు. చాలా మంది ప్రైవేటు విద్యా సంస్థలవైపు వెళ్తున్నారని చెప్పుకొచ్చారు.

# బిజెపి పునర్విభజన రాజకీయం !

న్యూఢిల్లీ,దక్షిణాదిలో బిజెపి పెద్దగా పట్టు సాధించలేకపోతోంది. తమిళనాడు, కేరళలో అడుగు పెట్టడమే కష్టంగా ఉంది. గత దశాబ్దంగా ఎంతగా ప్రయత్నించినా ఒక్కసీటు సాధించడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలోలోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరిగే బదులు తగ్గుతాయన్న ఆందోళన ఇప్పుడు దక్షిణాది నేతల్లో కలవరానికి గురి చేస్తోంది. 2011 జనాభా లెక్కలు తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ దక్షిణాదిలో జనాభా తగ్గింది. ఈ లెక్కన సీట్లు పెరగాల్సింది పోయి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే విషయమై ప్రధానంగా తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పిల్లలను కనాలని నవదంపతులకు పిలుపునివ్వడం కూడా జరిగింది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరిపించాలి. మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా వున్నా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రల్లో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్ లలో 12 నుంచి 15 శాతం వుండింది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవయ్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. అందువల్ల సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం ఎంపిల సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్వి భజన పక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీంతో ఇప్పటి వరు ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో గందరగోళం చెలరేగుతోంది. ఉన్నసీట్లు తగ్గిస్తే తమకు పార్లమెంటులో పట్టు లేకుండా పోతోందన్న ఆందోళన మొదలయ్యింది. నిజానికి ఇదో కీలకమైన అంశం. విధాన నిర్ణయం కూడా. ఇలాంటి కీలకాంశాలపై పారదర్శకంగా సమగ్రంగా చర్చ జరగాలి. దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కేంద్రం మాత్ర స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా చూడడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఎలాగూ దక్షిణాదితో వచ్చే లాభం లేదు కనుక సీట్లు తగ్గిస్తేనే మంచిదన్న కుత్సిత ఆలోచన ఏదైనా ఉందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి బిజెపి యత్నిస్తోందని అనేక ఆరోపణలు సైతం ఉన్నాయి. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరగడానికి చర్యలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ,



ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ స్టాలిన్ విమర్శ చేస్తున్నారు. అయితే హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అసలు పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరుతున్నారు. దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్న వేళ ఈ ఆందోళనపై స్పష్టత రావాల్సి ఉంది. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ప్రగతిని సాధించాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు. అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ పక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు. సాంకేతికంగానేగాక రాజకీయంగానూ ఈ మార్పులకు చాలా ప్రభావం వుంటుంది. బిజెపి ఎన్నిఎత్తులు వేసినా దక్షిణాదిన స్వంతంగా అధికారంలోకి వచ్చేంతగా బలం పెంచుకోవడంలో సఫలం కాలేకపోయింది. కర్ణాటక మినహా ఇతర చోట్ల ప్రత్యక్ష, పరోక్ష మిత్రులపైనే ఆధారపడి వుంటున్నది. ఇలాంటి సమయంలో పునర్విభజన పేరిట ఉత్తరాదిన సీట్లు పెంచి దక్షిణాదిన తగ్గించేలా రాజకీయ ఎజెండాతో ముందుకు పోతుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

# పాఠాలు పెడదారి.. గుణపాఠమే దారి



హైదరాబాద్,వరుసగా జరిగిన మానవవాదుల హత్యలు, హేతువాదులపై దాడులు, ఆలోచనా పరులైన రచయితలపై ఒత్తిళ్లు, నోట్ల రద్దు, జిఎస్‌టి, బ్యాంకుల దివాలా, రైతుల లాంగ్ మార్చ్ వంటివన్నీ భవిష్యత్ చీకటిగా ఉండబోతోందని హెచ్చరిస్తున్నాయి. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అందుకు కారణం కేంద్ర మంత్రుల ఉపన్యాసాలు ఒక కారణమైతే, వివిధ రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాలలోని అంశాలు మరొక కారణం! దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాఠశాల పాఠ్యపుస్తకాల్లో అసంబద్ధమైన అంశాలు, అసత్యాలు ఎలా చోటు చేసుకున్నాయో గమనించండి. పదమూడు పదిహేను సంవత్సరాల మధ్య వయస్సున్న బాల బాలికలకు తప్పుడు సమాచారం అందించడమంటే, వారిని తప్పుడు వ్యక్తులుగా తయారు చేయడమే కదా? గుజరాత్‌లో యాభై వేల మంది చదువుకునే ఒక సామాన్య శాస్త్ర పాఠ్యగ్రంథంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో జపాన్, అమెరికాపై అణుయుద్ధం ప్రకటించిందని ఉంది.వక్రీకరించిన చారిత్రక అంశాలు చదువుకుని భావిభారత పౌరులు ఎలా తయారవుతారన్నది ఆందోళనపడాల్సిన విషయం.అదే విధంగా స్త్రీల గౌరవాన్ని దిగజార్చే అంశాలు పాఠ్య గ్రంథాల్లో చేర్చడం వల్ల భవిష్యత్‌లో మహిళల పరిస్థితి ఏమిటి? రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్యగ్రంథంలో స్త్రీలకు గాడిదలకు పోలిక చూపబడింది. ఉదయం నుండి రాత్రి వరకు స్త్రీలు గాడిదల్లా చాకిరి చేయాల్సి ఉంటుందని హిందీ పాఠ్య పుస్తకంలో సెలవిచ్చారు. గాడిదలకు చెట్టుకింద కాసేపు విశ్రాంతి నివ్వొచ్చు. కాని స్త్రీలకు ఇవ్వకూడదు ‘పాపం గాడిదలు పారిపోయినా వెంటనే మళ్లీ దొరుకుతాయి. వాటికి స్త్రీల వలే పుట్టింటికి పారిపోయే సౌకర్యం లేదు’ అని ఆ పాఠం రాసిన రచయిత ఓ చమక్కు విసిరాడు. విషయాన్ని కిందిస్థాయి నుండి పైస్థాయి అధికారుల దాకా అందరూ ఆమోదించారు. కాస్త సున్నిత మనస్కులు, ఇంగిత జ్ఞానం ఉన్న ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే ఆ పాఠం పిల్లలకు ఎలా చెపుతారు? మనసు చంపుకుని ఉద్యోగ ధర్మంగా, పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా? ‘పిల్లల పాఠంలో అలాంటి అంశం ఎందుకుందని’ ఒక జాతీయ పత్రికా విలేకరి సంబంధిత అధికారిని అడిగితే “ఏదో పిల్లలకు కాస్త సరదాగా ఉంటుందని అలా పెట్టి ఉంటారని అదో పెద్ద విషయమా? ” అని ఎదురు ప్రశ్నించాడు. “భార్యలు గాడిదల్లాంటి వారు” అన్న వాక్యంలో అతనికి ఏ తప్పూ కనిపించలేదు. బిజెపి ప్రభుత్వాలున్న గుజరాత్, రాజస్థాన్‌లలో అధికారులకు, మంత్రులకు, ముఖ్యమంత్రులకు అలాగే కేంద్ర ప్రభుత్వం వారికీ ఎవరికీ అందులో తప్పే కనిపించలేదు. వీళ్లంతా ఆధునిక మనువాద ప్రతినిధులన్న మాట!సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) పాఠ్య పుస్తకంలో పది, పదకొండేళ్ల పిల్లలు చదువుకునే పుస్తకంలో మాంసాహారం తినేవారి వల్ల సమాజంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఉంది. మాంసాహారం తీసుకునేవారు అవలీలగా అబద్ధాలు చెపుతారని, ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోరని, అల్లర్లు, అలజడులూ సృష్టిస్తారని, ముఖ్యంగా లైంగిక దాడులకు పాల్పడుతారని, వారికి నిజాయితీ, నిబద్ధత ఉండవని, ఊరికే ఆవేశపడి బూతులు మాట్లాడుతారని ఉంది. ఇలా దోషాలన్నీ మాంసాహారులకు అంటగట్టి పసి మనసుల్ని ప్రభావం చేయడం ఏ సబబు? ఏ ఆహారం తీసుకుంటే ఏఏ లాభాలున్నాయి? ఎందులో ఎన్ని నష్టాలున్నాయి? అనేది శాస్త్రీయంగా వివరించాలి. ఆహారం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి.అంతేగాని, నైతికంగా దిగజారిన వారి లక్షణాలన్నీ గుదిగుచ్చి మాంసాహారులకు ఆపాదిస్తే, అది నిజమైపోదు కదా? ఒక రకంగా చూస్తే మాంసాహారులు శాఖాహారులు ప్రపంచంలో సమానంగా ఉండి ఉంటారు. లేదా మాంసాహారులు సంఖ్యే ఎక్కువగా ఉండి ఉంటుంది. అట్లని శాఖాహారులంతా సచ్ఛీలురు, సత్యవ్రతులు, సత్ప్రవర్తన గల మహనీయులు కాదు గదా? ఈ విషయమే సిబిఎస్ఇ డైరెక్టర్‌ని అడిగితే ‘పాఠ్యాంశాలపై దేశంలో నియంత్రణ లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో భాషలో విషయాలు ఒక్కో రకంగా ఉన్నాయని ఒప్పుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఏళ్లయిపోయినా బాలబాలికలకు చెప్పాల్సిన పాఠ్యాంశాలపై నిర్దుష్టమైన ప్రణాళిక లేకపోవడం ఘోరం! ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంశాలు, వక్రీకరణలు మారుతూ ఉండడం మరో ఘోరం!మధ్య భారతంలోని చత్తీస్‌గఢ్‌లో హైస్కూలు విద్యార్థుల పాఠ్య గ్రంథంలో ‘దేశంలో నిరుద్యోగ సమస్యకు మూల కారణం మహిళలు’ అని ఉంది. మహిళలు అన్ని రంగాల్లో విజృంభించడం వల్ల అన్ని రకాల ఉద్యోగాల్లో చేరుతూ ఉండడం వల్ల పోటీ ఎక్కువైంది. అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది అని ప్రభుత్వం వారు నిర్ధారించారు. స్త్రీ, పురుషులందరూ దేశ పౌరులైనప్పుడు పౌరులకు సమాన హక్కులున్నప్పుడు అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు పని చేయాలి. ఉద్యోగావకాశాలు కల్పించాలి. అంతేగాని, మహిళలు చదువుకుని ఉద్యోగాలకు పోటీపడడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందనడం అసంబద్ధంగా ఉంది.స్త్రీలను గాడిదలని, వారి వల్లే ఉద్యోగాలు లేకుండాపోయాయని, మాంసాహారులంతా నీతిమాలిన వారని చెపుతూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటోంది? జనాభాలో సగభాగమైన మహిళల్ని హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించగలరా? పాఠశాల స్థాయి నుండే పిల్లలకు అసత్యాలను నూరిపోస్తే పర్యవసానం ఎలా ఉంటుంది? ఎలాగైనా సరే మళ్లీ మనువాదన్ని నిలబెట్టే ప్రయత్నం బిజెపి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్నట్టుగా లేదూ? ఇలాగైతే భవిష్యత్తంతా అంధకారమే కదా? అచ్ఛేదిన్ స్వచ్ఛభారత్ నినాదాల కింద ఎంత మురుగు పేరుకుపోతోందో ప్రజలు తెలుసుకోవాల్సి ఉంది. ఒక్కటంటే ఒక్కటి ముందడుగు వేయకపోగా, దేశం వెయ్యడుగులు వెనక్కి వేస్తున్నట్టుగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ నిజాలు గ్రహించి, పిల్లలకు వాస్తవాలు చెప్పాలి. వారికి హేతుబద్ధంగా ఆలోచించడం నేర్పాలి!

## గాయనిని పెళ్లాడిన ఎంపీ తేజస్వీ సూర్య

న్యూఢిల్లీ,దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీల్లో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివాడు అయ్యాడు. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను మను వాడారు. వీరి వివాహం బెంగళూరులో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ నేతలు హాజరై

## పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యం

విజయవాడ, పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ సర్వేకు రూపకల్పన చేయడం జరిగింది.. ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పీ4 విధానం లక్ష్యమని వివరించారు. పేదల అవసరాలను గుర్తించి.. వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందని.. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. ఈ సమాచారాన్ని కుటుంబాలకు వివరించి.. కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరామితుల కచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబాలకు ఏవైనా అపోహలు ఉంటే తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. అన్ని సమన్వయ శాఖల సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తిచేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.రెండురోజుల పాటు మాస్టర్ ట్రైనర్లుగా ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ లేదా వార్డు సచివాలయ సిబ్బందికి సర్వేపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. టెక్ మాడ్యూల్‌తో పాటు సర్వే విధానాన్ని క్షుణ్నంగా వివరించాలన్నారు. ఇదిలావుంటే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో వేతనదారులకు పని కల్పించడంలోనూ, దినసరి వేతనం రూ. 300 వచ్చేలా చూడటంలోనూ నిర్దేశిరచిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, గ్రామాల వారీగా వేతనదారుల హాజరు, వారికి అందుతున్న వేతనం తదితరాల్లో పురోగతిని సమీక్షించారు. సగటు వేతనం విషయంలో పరిస్థితి మెరుగుపడిందని.. వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించడంలో పురోగతి చూపాలన్నారు. రోజుకు సగటున రూ. 300 పొందే హక్కు వేతనదారులకు ఉందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించాలని, పథకం కింద చేపట్టేందుకు గ్రామాభివృద్ధి, వ్యక్తిగత, సామాజిక పనులను గుర్తించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ఉదయాన్నే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని.. వేతనదారులకు తాగునీరు అందుబాటులో ఉంచేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి పనులపై ప్రతివారం జిల్లాస్థాయిలో సమీక్ష చేస్తున్నామని.. ఇదేవిధంగా ఎంపీడీవోలు మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. వారికిమజ్జిగను కూడా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో వేసవి కార్యాచరణపై క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో పాటు సందర్శకులకు వేసవి కార్యాచరణలో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వడదెబ్బ తగిలే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని.. ఈ విషయమై ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆదేశించారు. చలివేంద్రాల కార్యకలాపాలను నిరంతరం సమీక్షించాలని, ఒక్క మనుషులకే కాదు.. పశుపక్ష్యాదులకూ తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. బస్టాండ్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్లు తదితరాల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటినుంచే గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బ చికిత్సలకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

## పార్లమెంట్ సీట్లు పెరిగితే బిజెపికే లాభం

న్యూఢిల్లీ,పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యు.పి వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా..నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎం.పి 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండింతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్దారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడో వంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు

# రాములమ్మ ఎమ్మెల్సీ ప్రయత్నాలు!



హైదరాబాద్,గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ అలా పూర్తయిందో లేదో..ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చిపడ్డాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కోలాహలం మొదలైంది. మొత్తం 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఒకటి బీఆర్ఎస్ కు, నాలుగు కాంగ్రెస్ కు దక్కనున్నాయి. అయితే ఇందులో నాలుగో సీట్లలో కాంగ్రెస్ గెలవాలంటే ఎంఐఎం మద్దతు తప్పనిసరి. ఈక్రమంలో కాంగ్రెస్ కు నాలుగు సీట్లు దక్కనుండడంతో వీటి కోసం భారీగా కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారు.ఆశావహుల్లోకి రాములమ్మ విజయశాంతి కూడా వచ్చి చేరారు. రాములమ్మ తెలంగాణలోని పార్టీలన్నింటినీ చుట్టేసిన సంగతి తెలిసిందే. మొదట్లో బీజేపీలో ఉన్నా రాములమ్మ ఆ తర్వాత ఓ పార్టీ పెట్టారు. ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరారు. ఆ తర్వాత కేసీఆర్ పై కోపంతో కాంగ్రెస్ లో చేరారు. కేసీఆర్ పై కోపంతో కాంగ్రెస్ లో చేరినా.. ఆ పార్టీలో పెద్దగా యాక్టివ్ గా లేరు. ఎప్పుడోగాని ఓ ట్వీట్ చేసి వదిలేస్తారు. ఎన్నికల ముందు అలా ఒకసారి వచ్చిపోతారు. అంతేగాని ఆమె కాంగ్రెస్ లో ఉన్నట్టు పెద్దగా క్యాడర్ కూడా గుర్తించడం లేదు. ఈనేపథ్యంలో విజయశాంతి తనకు ఓ పదవికావాలని డైరెక్ట్ గా హైకమాండ్ ను కలిశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి పార్టీకి తాను ఎనలేని సేవలు అందించానని, తన సేవలు, త్యాగాన్ని గుర్తించి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవిని తనకు కేటాయించాలని కోరారు. దీనికి హైకమాండ్ ఎలా స్పందిస్తుంది అనేది తర్వాత తెలుస్తుంది.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు విపరీతమైన పోటీ ఉంది. కాంగ్రెస్ కు వచ్చే నాలుగు సీట్లకు నలభై ఆరు మంది పోటీ పడుతున్నారు. ఇందులో తమకూ ఒక సీటు కావాలని మిత్రపక్షం సీపీఐ కోరుతోంది. అలాగే గ్రేటర్ ఎన్నికల్లో ఎంఐఎం మద్దతు ఇవ్వాలంటే దానికో సీటు ఇవ్వాలి. అంటే నాలుగు సీట్లలో రెండు సీట్లు మిత్రపక్షాలకే పోతే పార్టీ నాయకులకు ఎలా అవకాశం ఇచ్చేది అంటూ అధిష్ఠానం ఇరకాటంలో పడింది. ఒక వేళ మిత్రపక్షాలకు ఇవ్వకపోయినా నాలుగు సీట్లను కాంగ్రెస్సే తీసుకున్నా.. వాటిని కేటాయించడం కూడా తలనొప్పిగానే మారింది.ఎమ్మెల్సీ సీటు కోరుతున్న వారందరూ గతంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలప్పుడు త్యాగం చేసిన వారే. అలాగే ఎక్కువ మంది రేవంత్ అనుచరులే ఉన్నారు. కొందరు ఎప్పటినుంచో ఏ అవకాశం లేకుండా ఉన్నారు. వారూ తమకూ కేటాయించాలని అడుగుతున్నారు. ఇదిలా ఉంటే నాలుగు సీట్లను సామాజిక వర్గాల వారీగా ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఓసీ,బీసీ,ఎస్సీ, ఎస్టీ కి కేటాయించాల్సి ఉంది. బీసీల్లో వివిధ కులాలు తమకు కేటాయించాలంటున్నాయి. ఎస్సీల్లో మాల, మాదిగ వర్గాలు తమకే కేటాయించాలంటున్నాయి.ఎమ్మెల్సీ సీట్లకు ఇంత పోటీ ఉన్న నేపథ్యంలో.. ఎప్పుడో ఒకసారి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే విజయశాంతికి సీటు ఇస్తుందా అనేది డౌటే అంటున్నారు విశ్లేషకులు. ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వడం అనేది పూర్తిగా హైకమాండ్ చేతిలోనే ఉంటుంది. రాష్ట్ర నేతలు పంపించిన వివరాల ప్రకారం వారు సెలక్ట్ చేస్తారు. మరి ఇంత కాంపిటీషన్ లో రాములమ్మకు బెర్త్ ఖాయమవుతుందా? లేదా అనేది రెండు, మూడు రోజుల్లోనే తేలనుంది.

# ఇంకా బాబు సీరియస్ కాలేదా?



అమరావతి,అధికారం అనేది కళ్లకు పొరలు కమ్మేలా చేస్తుంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనే ఆలోచన, విచక్షణ మరిచేలా చేస్తుంది. ఏమైనా చేయొచ్చనే లెక్కలేని తనాన్ని ప్రదర్శించేలా చేస్తుంది. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే%ా% తాజాగా పల్నాడు జిల్లా నరసారావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి రచ్చరచ్చ చేయడం వల్లే మాట్లాడుకోవాల్సి వచ్చింది. ఈయన టీడీపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల్లో సంబంధిత ప్రజా ప్రతినిధులు అధికార మదంతో వ్యవహరించడాన్ని ప్రజలు జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఇలాంటి ఘటనలు తెరపైకి వచ్చినప్పుడల్లా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యారని ప్రభుత్వ అనుకూల మీడియాకు అలవాటైంది.రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య అన్నమయ్య జిల్లా పర్యటనలో ఒక సీఐ ఆలస్యంగా వచ్చాడనే కారణంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మంత్రి భార్యననే కారణంతో రుబాబు ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో మంత్రితో సీఎం బాబు ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహించారని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని హెచ్చరించినట్టు వార్తలొచ్చాయి.ఉమ్మడి కృష్ణా జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సొంత పార్టీ నాయకులు, అలాగే సొంత మీడియా ప్రతినిధులతో పాటు వైసీపీకి చెందిన వాళ్లపై నోటి, చేతి దురుసు ప్రదర్శించారు. ఏకంగా చట్టాన్ని తన చేతిలోకి తీసుకుని వైసీపీ నాయకుడి భవనంపైకి బుల్డోజర్‌తో ఊరేగింపుగా వెళ్లడం తీవ్ర విమర్శలపాలైంది. కొలికపూడి వ్యవహారం శ్రుతిమించడంతో చంద్రబాబు ఒకట్రెండుసార్లు పిలిపించుకుని హెచ్చరించారని మీడియాలో వార్తలు రావడం గురించి అందరికీ తెలిసిందే.ఈ మధ్య దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఒక పెళ్లి వేడుకలో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కారు డ్రైవర్‌పై ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఇలాగైతే ప్రజల్లో చెడ్డపేరు వస్తుందని, చింతమనేనిపై బాబు అసహనం ప్రదర్శించారనే వార్తల్ని చదివాం.ఇటీవల ఫైబర్‌నెట్ ఎండీ దినేశ్‌కుమార్, మరో ముగ్గురు ఉద్యోగుల తీరుపై చైర్మన్ హోదాలో జీవీరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆ సందర్భంలో కూడా జీవీరెడ్డిని పిలిపించుకుని చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్టు ప్రచారం జరిగింది. ఇలా అన్ని సందర్భాల్లోనూ చంద్రబాబు అరాచకాల్ని, క్రమశిక్షణ ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటారనే సానుకూల సందేశాన్ని, సంకేతాన్ని పంపాలని టీడీపీ అనుకూల మీడియా తాపత్రయ పడుతోంది. కానీ కూటమి ప్రజా ప్రతినిధుల దోపిడీ, అరాచకాలు మాత్రం ఆగలేదు. ఇందుకు తాజా ఉదాహరణ%ా%. అధికార పార్టీకి చెందిన నరసారావుపేట ఎమ్మెల్యే ఎక్సైజ్ కమిషనరేట్‌లో చేసిన రచ్చ.జనసేన ప్రజా ప్రతినిధులేమీ తక్కువ తినలేదు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఒక మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌పై ప్రదర్శించిన నోటి దురుసుకు పౌర సమాజం అవాక్కైంది. బయటికి రానివి ఇంకెన్నో. సమాజం దృష్టిలో పడినప్పుడల్లా చంద్రబాబు, పవన్ సీరియస్ అయ్యారనడం, ఆ తర్వాత కూటమి నేతల తీరు షరా మామూలే. కేవలం చంద్రబాబును మంచిగా చూపడానికి, అధికార పార్టీ నేతల చెడు గురించి ప్రభుత్వ మీడియా రాస్తోందే తప్ప, మరే ఉద్దేశం కనిపించడం లేదు. చంద్రబాబు సీరియస్ కావడం వరకే పరిమితమా? ఏవైనా చర్యలు తీసుకునే పరిస్థితి వుందా? అనే ప్రశ్న ఏపీ పౌరుల మెదళ్లను తొలుస్తోంది. ఎందుకంటే నిజంగా చంద్రబాబు అంటే భయం ఉంటే ఇంత పబ్లిక్‌గా జనాలను, ప్రభుత్వ అధికారులను హింసించారు కదా అని ప్రజలు భావిస్తున్నారు. చూడాలి ఇవాళ అధికార పార్టీ మీడియా ఎమ్మెల్యేకి వార్నింగ్ ఇచ్చిన సీఎం అని హెడ్‌లైన్ రావచ్చు.

# అధికార కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే షాక్

కరీంనగర్,రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ తగిలింది. కాంగ్రెస్ కొత్త వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఇక్కడికి వచ్చిన సమయంలోనే ఎమ్మెల్సీ ఫలితాలు చేదు అనుభవాన్ని చూపాయి. కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, నటనలు చేయొద్దని హెచ్చరిస్తున్న నేపథ్యంలోనే రెండు ఎమ్మెల్సీలను బిజెపి కైవసం చేసుకుంది. ఇది ఓ రకంగా అధికార కాంగ్రెస్‌కు హెచ్చరిక లాంటిది.ఉత్తర తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ ఎన్నికల్లో రెండు స్థానాలను బిజెపి ఎగురేసుకు పోయింది. గ్యాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలను రెండూ బిజెపి ఖాతాలో పడ్డాయి. ఇది ఓ రకంగా విద్యావంతుల్లో కాంగ్రెస్ పట్ల నిరసనలకు నిదర్శనంగా చూడాలి. ఉద్యోగాల భర్తీపై నిరుద్యోగుల్లో ఉన్న నిసనగా చూడాలి.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీలో మల్క కొమురయ్యలు విజయం సాధించారు. ఉమ్మడి కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాన్ని ఆరేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నెగ్గిన కాంగ్రెస్‌కు ఇప్పుడు అధికారంలో ఉన్నా ఎదురుదెబ్బ తగిలింది. సిటింగ్ స్థానం కావడం... రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున తప్పనిసరిగా గెలిచి తీరాలని అధిష్ఠానం పీసీసీకి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశర చేసినా చివరికి ఓటమి తప్పలేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల్లో నియామకాలు, పీసీసీ కార్యవర్గంలో పదవుల పంపకం ఉంటుంది కాబట్టి ఆశావహులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ప్రతిష్మాత్మకంగా తీసుకుని పనిచేస్తారని తొలుత అందరూ భావించారు. కానీ వారు కూడా పెద్దగా క్షేత్రస్థాయిలో తిరగలేదు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు వచ్చే మెజార్టీనే ఎమ్మెల్యేల పనితీరుకు గీటురాయిగా పరిగణిస్తామని పార్టీ ముందే అంతర్గతంగా చెప్పినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టాలని భాజపాకు పరోక్షంగా మద్దతు ఇచ్చేందుకు భారాస లోపాయికారీ ఒప్పందం చేసుకుందని తాము ముందే పలుమార్లు చెప్పినా ఈ వ్యూహాన్ని ఛేదించేందుకు క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికతో పనిచేయలేదని అధికార పార్టీ నేతలు పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా నిజామాబాద్‌లో సైతం నేతలు సరిగా పనిచేయలేదు. పైగా ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టిన తరవాత నేరుగా జరిగిన తొలి ఎన్నిక ఇది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలను పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఓటర్ల దగ్గరకు వెళ్లి చెప్పి ఆకట్టుకోలేకపోయారు. ఓటర్లంతా పట్టభద్రులు కావడంతో వారిని ఆకట్టుకోవడానికి ప్రత్యర్థులు సోషల్ మీడియాలో ప్రచారాన్ని ప్రధాన అస్త్రంగా వినియోగించుకుంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంలో పట్టనట్లు వ్యవహరించారనే విమర్శలున్నాయి. అభ్యర్థి ఎంపికలో జాప్యం జరగడం, ముందు నుంచి అనుకున్నవారికి కాకుండా చివరి క్షణంలో మరొకరికి టిక్కెట్ ఇవ్వడం కూడా పార్టీకి నష్టం కలిగించిందన్న విమర్శలు ఉ



న్నాయి. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి మూడు చోట్ల సభలు పెట్టినా ఫలితం దక్కలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ భారాస ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో కాంగ్రెస్, భాజపాల మధ్య ద్విముఖ పోరు గురించే ఎక్కువగా చర్చ జరిగింది. కానీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గట్టి పోటీనివ్వడం కాంగ్రెస్‌ను దెబ్బతీసింది. వాస్తవానికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని హరికృష్ణ చాలా ముందు నుంచే క్షేత్ర స్థాయిలో పనిచేశారు. చివరిక్షణంలో నరేందర్‌రెడ్డిని తెరపైకి తేవడంతో హరికృష్ణ బీఎస్పీ నుంచి బరిలోకి దిగడం కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. హరికృష్ణకు టికెట్ ఇవ్వాలని కోరిన కొందరు కాంగ్రెస్ నేతలు పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి కష్టపడి పనిచేయలేదని తెలుస్తోంది. ఉద్యోగులకు, రిటైరైన వారికి బిల్లుల చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వం బాగా ఆలస్యం చేస్తుండటం కూడా విద్యావంతుల్లో అసంతృప్తి ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ముగ్గురు మంత్రులు, నలుగురు ఇంఛార్జి మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పైగా భారాసకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. నేరుగా ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇంఛార్జులను సైతం నియమించింది. ప్రధాన ప్రత్యర్థి భాజపాకు నలుగురు ఎంపీలుండటం, వారిలో ఒకరు కేంద్ర మంత్రి అయినందున గట్టిగా పోరాడతారని, దాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడికక్కడ పార్టీ స్థానిక శ్రేణులతో కలసి వ్యూహం రచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ముందే సూచించారు. కానీ క్షేత్రస్థాయిలో చాలామంది ఆ మేరకు శ్రద్ధతో పనిచేయలేదు. ఈ ఎన్నికలతో ఓ రకంగా అధికార పార్టీకి హెచ్చరిక లాంటిది. మంత్రులు విమర్శలకే పరిమితం అవుతున్నారు. పనులు జరగడం లేదు. మూసపద్ధతిలో పాలన సాగిస్తున్నారు. ఇచ్చిన హామీలు పక్కన పెట్టినా, రోజువారీ కార్యక్రమాలు సజావుగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

# నెల్లూరు జిల్లాలో వేడెక్కిన రాజకీయం




నెల్లూరు,వైసీపీ హయాంలో జరిగిన భారీ కుంభకోణం బయటపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై దృష్టి పెట్టింది. బాధితులు కూడా పెద్దఎత్తున ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తున్నారు.ఇప్పటికే పదిమంది అధికారులతో సిట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పర్యవేక్షణాధికారిగా బాపట్ల ఎస్పీ, పరిశోధనాధికారిగా బాపట్ల డీఎస్పీ రెండు రోజులుగా ముమ్మర విచారణ జరుపుతున్నారు. గ్రావెల్ అక్రమాలపై పెద్ద ఎత్తున పోరాటం చేసిన మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. టీడీపీ నేతలపై కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి భారీ భూదందాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. కాకాణి అక్రమ భాగోతాలు బయటకు వస్తున్నాయి. రూ.230కోట్ల విలువ చేసే పేదల భూములను తన అల్లుడు కంపెనీకి అప్పనంగ దోచిపెట్టినట్లు కాకాణిపై ఆరోపణలు వచ్చాయి. రామదాసుకండ్రిగ ప్రాంతంలో పోర్టు రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను కాజేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఒక్కో అవినీతి వ్యవహారాన్ని బయటకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రైతులను బెదిరించి, భయపెట్టి ఎకరా భూమి రూ.15,62,142లు చెల్లించినట్లు కాకాణిపై ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్కరోజు ముందు కాకణి అల్లుడి డొల్లకంపెనీకి భూములను గత జగన్ ప్రభుత్వం అప్పగించింది. 2024 మార్చి నెల 16న ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈసీ ఇచ్చిన విషయం తెలిసిందే. మార్చి నెల 15న భూములు అప్పగిస్తూ ప్రొవిజనల్ అలాట్‌మెంట్‌ను ఏపీఐఐసీ ఆర్డర్ మంజూరు చేసింది. భూముల అప్పగింతకు కాకాణి, వైసీపీ పెద్దలు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు చక్రం తిప్పారు. డొల్ల కంపెనీలో రాత్రికి రాత్రే కాకాణి అల్లుడు మన్నెం గోపాలకృష్ణారెడ్డికి సీఈఓ పదవి అప్పగించారు. కాకాణి భూ కుంభకోణాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడంతో ఇప్పుడు ఒక్కోటి బయటకు వస్తున్నాయి. పెట్టింది. ఈ విషయంపై విచారణ జరిపించి, న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ వ్యవహారంతో నెల్లూరు జిల్లా రాజకీయం ఒక్కసారిగావేడెక్కింది. వైసీపీ హయాంలో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి ఓ వెలుగు వెలుగొందారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో వారెవరికీ నిద్ర కూడా పట్టడం లేదట. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆయన అనుచరులకు ఇప్పుడు ఫోర్జరీ ఉచ్చు బిగుస్తోంది. జగన్ జమానాలో పెద్ద ఎత్తున గ్రావెల్ దందా. కాకాణి అండతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వేపల్లి రిజర్వాయర్‌తో సహా చెరువుల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టి రూ.వందల కోట్లలో స్వాహా చేశారు. అలాగే ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సంతకం ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మాగుంట పేరుతోనూ అక్రమ అనుమతులు తీసుకోవడంతో అప్పట్లోనే కాకాణి అనుచరులపై కేసులు నమోదయ్యాయి.

# బంగారం..బంగారమవుతోంది..అందనంతగా రోజురోజుకూ పెరుగుదల

న్యూఢిల్లీ, బంగారం..బంగారమవుతోంది. అందనంతగా రోజురోజుకూ ధరల పెరుగుదలకలవరానికి గురిచేస్తోంది. పదిగ్రాములు లక్షకు చేరడం ఖాయమంటున్న విశ్లేషకుల మాటలతో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో మరింత భారంగా ధరల పెరుగుదల సామాన్యులకు భారంగా మారింది. ఇలా బంగారం, వెండి ధరలు అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్నాయి. గత మూడు నెలల్లోనే బంగారం ధరలు అమాంతంగా పదివేలకు పైగా పెరిగాయి. దీంతో దాని దూకుడు ఎలా ఉందో గమనించవచ్చు. శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరలు రోజు రోజుకు ప్రజలకు అందనంతగా పెరుగుతున్నాయి. బంగారం ధర పెరగడానికి అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌హెచ్చరికలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత, ఫెడ్? వడ్డీ రేట్లు వంటి అంశాలు పసిడి ధరల్లో హెచ్చుతగ్గులకు కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ బంగారం ధర భారీగా పెరిగిన నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడం తప్పనిసరి అవుతోంది. ప్రధాన నగరాలలో బంగారం ధరలు ఎలా అటుఇటుగా ఒకే రేట్లను పలుకుతున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 80,660గా ఉంది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 87,990గా నమోదైంది. విజయవాడలో సైతం ఈ రేట్లే కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో కూడా ధరలు ఇలాగే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములు రూ. 80,810 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 88,140గా ఉంది. కోల్‌కతాలో ప్రస్తుతం 22 క్యారెట్ల పసిడి ధర రూ. 80,660 పలుకుతోంది. 24 క్యారెట్ల గోల్డ్.. 87,990గా ఉంది. ముంబై, బెంగళూరు, కేరళలోనూ ఇవే రేట్లు కొనసాగుతున్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల ధర 10 గ్రాములు రూ. 80,660 ఉండగా, 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములు రూ. 87,990గా ఉంది. అలాగే పూణెలో 22 క్యారెట్ల గోల్డ్ రూ. 80,660 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ. 87,990గా నమోదైంది. అహ్మదాబాద్?లో.. 22 క్యారెట్ల ధర రూ. 80,710 కాగా.. 24 క్యారెట్ల పసిడ ధర రూ. 88,040గా కొనసాగుతోంది. భువనేశ్వర్ 22 క్యారెట్ల బంగారం ధర రూ. 80,660.. 24



క్యారెట్ల పసిడి ధర రూ. 87,990గా ఉంది. దేశంలో వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ. 100 తగ్గి రూ. 97,900 వద్ద కొనసాగుతోంది. క్రితం రోజు ఈ ధర రూ. 98,000గా ఉండేది. కాగా.. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 1,06,900గా ఉంది. కోల్‌కతాలో రూ.? 99,400, బెంగళూరులో రూ. 97,900గా ఉంది. బంగారు పదిగ్రాముల ధరల లక్షకు ఏరడం ఖాయమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్,అటు ప్రకృతి కన్నెర్ర.. ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు ఆత్మహత్య బాట పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరేడుకొండ మండలంలో ఓ రైతు దంపతులు అప్పుల ఇబ్బందులతో ఆత్మహత్యకు ఒడిగట్టారు. వీరిలో భర్త మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని వడూర్‌కు చెందిన ఆడెపు పోశెట్టి(60), ఇందిరా(52) అనే రైతు దంపతులు ఆర్థిక సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. పోశెట్టి మరణించగా భార్య ఇందిరాను చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి దంపతులకు మూడెకరాల భూమి ఉండగా ఇటీవల పత్తి కంది పంటలను సాగు చేశారు. వీరికి రెండు లక్షల 30 వేల వరకు అప్పులు ఉన్నాయి. పంట నష్టంతో పాటు వారికి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సైతం మాఫీ కాలేదు. ఇటీవల ఇద్దరు కూతుర్ల వివాహం చేయడంతో పాటు, నూతన గృహం సైతం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.

# ముంబైలో టెస్లా తొలి షోరూమ్.. నెల అద్దె ఎంతో తెలుసా..?




ముంబై:లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. తన తొలి షోరూమ్‌ను దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు బుధవారం వెల్లడించాయి.సీఆర్ఈ మ్యాట్రిక్స్ వివరాల ప్రకారం.. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారు. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసింది.ఎలన్ మస్క్ సారథ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం. మోదీతో భేటీ అయిన రోజుల వ్యవధిలోనే టెస్లా ఈ చర్యలు చేపట్టడం విశేషం.ఇక భారత్‌లో తొలి రెండు షోరూమ్‌లను ఏర్పాటుకు దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాలను సంస్థ ఎంపిక చేసింది. ఇటీవలే నియామకాల ప్రక్రియ కూడా చేపట్టింది . కస్టమర్ రిలేటెడ్, బ్యాక్ఎండ్ జాబ్ సహా 13 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు కావాలంటూ ప్రకటన ఇటీవలే చేసింది. ఇందులో సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతున్నట్లు తెలిపింది. మిగిలిన పోస్టులకు ఉద్యోగులను కేవలం ముంబై కేంద్రంగా తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

### అసెంబ్లీలో నిలదీస్తారనే భయంలో జగన్: ఆది

అమరావతి,జగమంతా ఈ జగములో చేయనన్ని తప్పులు వైకాపా అధినేత జగన్ చేశారని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించారు. తన తప్పులను అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రాకుండా తప్పించుకొని తిరుగుతున్నారని ఆరోపించారు. రాష్ట్రం బాగు కోసం జగన్ అసెంబ్లీకి రావాలని ఆదినారాయణరెడ్డి ఆహ్వానించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com